
sahanamvande.com

సహనం వందే

epaper.sahanamvande.com


హైదరాబాద్ | 21-11-2026 శనివారం | సంపుటి-02 సంచిక : 200 EDITOR: ROHINI





25 దేశాల్లో విద్యార్థుల తిరుగుబాటు

భగ్గుమన్న యూరప్... రగిలిన యూత్





- రోడ్డెక్కిన లక్షలాది మంది విద్యార్థులు
- చదువుకు డబ్బుల్లేవ్.. యుద్ధాలకెక్కడివి?
- యుద్ధ ఖర్చులపై యువత ఆగ్రహజ్వాల
- బ్రిటన్‌లో 350 విద్యాసంస్థల భాగస్వామ్యం

చేతిలో పుస్తకాలు పట్టుకుని తరగతి గదుల్లో ఉండాల్సిన యువత.. ఇప్పుడు ప్లకార్డులు పట్టుకుని రోడ్లపైకి వస్తోంది. తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాల్సిన వయసులో.. ఆ భవిష్యత్తుకే భరోసా లేకుండా పోవడంతో ప్రభుత్వాలను నిలదీస్తోంది. చదువుకు డబ్బుల్లేవంటారు.. కానీ యుద్ధాలకు మాత్రం భారీగా ఖర్చు చేస్తారెందుకని ప్రశ్నిస్తోంది. ఒకటి రెండు దేశాలు కాదు.. ఏకంగా 25కి పైగా యూరప్ దేశాల్లో యువత గొంతు ఒక్కటవుతోంది. ఇంతకీ ఈ ఉద్యమం వెనుక ఉన్న కారణాలేంటి?

- సహనం వందే, యూరప్

శుక్రవారం జరిగిన అంతర్జాతీయ యువజన నిరసన కార్యక్రమంలో 25కి పైగా దేశాల విద్యార్థులు పాల్గొన్నారు. బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, స్పెయిన్, ఐర్లాండ్, గ్రీస్, నెదర్లాండ్స్ సహా పలు దేశాల్లో తరగతులను బహిష్కరించి ర్యాలీలు నిర్వహించారు. లక్షలాది మంది పాల్గొన్నారని అంచనా వేస్తున్నారు. ఈసారి విద్యార్థుల పోరాటం కేవలం ఫీజులకే పరిమితం కాలేదు. జీవన వ్యయం, నిరుద్యోగం, యుద్ధాలు, పర్యావరణం వంటి అంశాలూ ఉద్యమంలో భాగమయ్యాయి.

చదువుకు భారమైన ఖర్చులు!

పెరుగుతున్న నిత్యావసరాల ధరలు, ఇంటి అద్దెలు, రవాణా ఖర్చులు యువతను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఉన్నత విద్య కోసం భారీగా ఫీజులు చెల్లించాలి. చదువు పూర్తయ్యాక ఉద్యోగం దొరుకుతుందన్న భరోసా లేదు. ఉద్యోగం వచ్చినా పెరిగిన ఖర్చులకు సరిపడా ఆదాయం ఉంటుందో లేదో తెలియని పరిస్థితి. మరోవైపు విద్యాసంస్థలకు నిధులు తగ్గించడం, ఫీజుల భారం పెరగడం విద్యార్థుల ఆగ్రహానికి కారణమవుతున్నాయి. విద్య కొందరికే అందుబాటులో ఉండే వ్యాపారం కాకుండా ప్రతి ఒక్కరికీ అందే హక్కుగా ఉండాలని యువత కోరుతోంది.

యుద్ధాలకు నిధులు.. విద్యకు కోతలా?

ఈ నిరసనల్లో అత్యంత బలంగా వినిపిస్తున్న అంశం యుద్ధ వ్యయం. విద్య, వైద్యం, సంక్షేమ రంగాలకు నిధులు తగ్గిస్తున్న ప్రభుత్వాలు ఆయుధాల కొనుగోళ్లకు మాత్రం భారీగా ఖర్చు చేస్తున్నాయని విద్యార్థి సంఘాలు విమర్శిస్తున్నాయి. గాజాపై ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న యుద్ధం విషయంలో యూరప్ ప్రభుత్వాల వైఖరినీ కొందరు నిరసిస్తున్నారు. యుద్ధాలకు బదులుగా పాఠశాలలు, విశ్వవిద్యాలయాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇటలీ, జర్మనీల్లో నిరసనలు!

ఇటలీలోని రోమ్, జెనోవా, బొలోగ్నా, మిలాన్ నగరాల్లో వేలాది మంది విద్యార్థులు ర్యాలీలు నిర్వహిస్తున్నారు. యుద్ధాలకు కాదు.. పాఠశాలలకు డబ్బులు కేటాయించాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్నారు. జర్మనీలోని కొలోన్‌లో దాదాపు పదివేల మంది పాల్గొన్నారని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. ఫ్రాంక్‌ఫర్ట్‌లోనూ నిరసనలు జరిగాయి. విద్య, వైద్యం, సామాజిక సేవలకు నిధులు పెంచాలని యువత డిమాండ్ చేస్తోంది. సైనిక నియామకాలు, తప్పనిసరి సైనిక సేవలపైనా ఆందోళన వ్యక్తం చేస్తోంది.

బ్రిటన్‌లో 350 విద్యాసంస్థలు!

బ్రిటన్‌లో 350కి పైగా పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల విద్యార్థులు ఈ నిరసనల్లో పాల్గొంటున్నారు. సోషలిస్ట్ స్టూడెంట్స్ సహా పలు సంఘాలు ఉద్యమానికి మద్దతిస్తున్నాయి. మరోవైపు ఏఐ విస్తరణతో ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతాయన్న భయం యువతను వెంటాడుతోంది. వాతావరణ మార్పులు, పర్యావరణ కాలుష్యంపైనా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమకు ఉద్యోగాలు, నాణ్యమైన విద్యతోపాటు సురక్షితమైన భవిష్యత్తు కావాలని కోరుతున్నారు.

ప్రభుత్వాలకు యువత హెచ్చరిక!

మొత్తంగా యూరప్‌లోని యువత చెబుతున్న సందేశం ఒక్కటే. అభివృద్ధి అంటే ఆయుధాల కొనుగోలు మాత్రమే కాదు.. భావితరాలకు విద్య, ఉపాధి, భద్రమైన జీవితం కల్పించడం కూడా. తమ భవిష్యత్తు కోసం యువతే రోడ్లపైకి రావాల్సి వస్తోందంటే ప్రభుత్వాలు ఆలోచించాల్సిన సమయం వచ్చినట్టే. ఈ నిరసనలు పాలకుల విధానాల్లో ఎలాంటి మార్పులు తీసుకొస్తాయన్నది ఇప్పుడు ఆసక్తికరం.


ఒక్కో ఉద్యోగికి 900 కోట్లు

రాత్రికి రాత్రే 5,100 మంది కోటీశ్వరులు

- ప్రపంచాన్ని కుదిపేసిన ఆంథ్రోపిక్ కంపెనీ
- నెల జీతం నుంచి వందల కోట్ల సంపాదన
- స్టాక్ మార్కెట్‌లో కనీవినీ ఎరుగని జాక్‌పాట్!
- ఐదేళ్ల చిన్న సంస్థ.. 155 లక్షలకోట్ల సంపద
- ప్రతి వంద మందిలో 96 మంది కోటీశ్వరులు

ఒక ఉద్యోగం చేస్తే నెలకు జీతం వస్తుంది. కొంచెం పొదుపు చేస్తే పదేళ్లకో, ఇరవై ఏళ్లకో ఒక ఇల్లు కొనుక్కోవచ్చు. ఇదే మనకు తెలిసిన లెక్క! కానీ ఒక కంపెనీలో ఉద్యోగం చేస్తే ఏకంగా రూ.900 కోట్లు సంపాదించవచ్చంటే నమ్ముతారా? అదీ లాటరీ కాదు.. అదృష్టం కొద్దీ వచ్చిన ఆస్తి కాదు.. కంపెనీలో పనిచేసినందుకు వచ్చిన వాటాల విలువ!

- సహనం వందే, అమెరికా



అమెరికాలోని ఆంథ్రోపిక్ అనే ఏఐ సంస్థ ఇప్పుడు ఇదే సంచలనం సృష్టించింది. నిన్నటివరకు ఉద్యోగులుగా ఉన్నవాళ్లు.. ఈరోజు వందల కోట్ల ఆస్తులున్న సంపన్నులుగా మారిపోయారు. ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా 5,100 మంది! వారి వద్ద రూ.9 కోట్లకు పైగా షేర్లు ఉన్నాయి. అంటే ప్రతి వంద మందిలో 96 మంది కోటీశ్వరులు. దాదాపు 2,800 మందికి రూ.90 కోట్లకు పైగా, 600 మందికి రూ.900 కోట్లకు పైగా వాటాలు ఉన్నాయి. వీరంతా వ్యవస్థాపకులు కాదు, సాధారణ ఉద్యోగులే. 2021లో మొదలైన ఆంథ్రోపిక్ క్లాడ్ ఏఐతో వేగంగా ఎదిగింది. 2024 చివరికి వెయ్యిలోపు ఉన్న సిబ్బంది ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి 5,300కు చేరారు.

షేర్ల విలువ ఎలా పెరిగింది?

ఆంథ్రోపిక్ షేరు ధరను 83 డాలర్లుగా నిర్ణయించింది, ఇది సుమారు రూ.7,400కు పైమాటే. ఉద్యోగులకు ముందుగానే వాటాలు ఇవ్వడం వల్ల కంపెనీ ఎదుగుదలతో వారి ఆస్తి పెరిగింది. ముఖ్యంగా 2023, 2024లో చేరినవారికి భారీ లాభం వచ్చింది. కొన్ని పాత స్టాక్ ఆప్షన్ల ధర కేవలం 52 సెంట్లు మాత్రమే ఉండగా, ఇప్పుడవి వేల రూపాయలకు చేరాయి. ప్రతిభను నిలుపుకోవడానికి సంస్థలు ఇచ్చే వాటాల సూత్రమే ఇక్కడ పనిచేసింది.

చేతిలో నగదు.. కంపెనీ విలువ!

షేర్ల విలువ పెరిగినంత మాత్రాన వెంటనే అంతా నగదు రాదు. షేర్లు అమ్మితేనే, పన్నులు పోగా డబ్బు చేతికొస్తుంది. ఆంథ్రోపిక్ మొదటి రోజు 10 శాతం, ఫలితాల తర్వాత మరో 35 శాతం అమ్మే అవకాశం ఇచ్చింది. ట్రేడింగ్‌లో షేరు 111 డాలర్లు దాటి, తొలి రోజు 97.17 డాలర్ల వద్ద నిలిచింది. దీంతో మార్కెట్ విలువ సుమారు 1.75 ట్రిలియన్ డాలర్లు అంటే రూ.155 లక్షల కోట్లకు చేరింది.

ఉద్యోగుల నిర్ణయాలు.. కొత్త సవాళ్లు!

ఇంత సంపద వచ్చాక ఉద్యోగులు కొనసాగుతారా, కొత్త సంస్థలు పెడతారా అనేది ఆసక్తికరం. ప్రతిభావంతులను నిలుపుకోవడం కంపెనీకి పెద్ద సవాలు. మనుషులు, నైపుణ్యాలే సంస్థను నిలబెడతాయి. జీతం అవసరాలు తీరుస్తుంది, సరైన వాటా జీవితాన్నే మారుస్తుంది. మన దేశంలోనూ ఉద్యోగులకు వాటాలిచ్చే సంస్కృతి పెరగాలా?


డాక్టర్ గారి విస్కీ యాత్ర

మందు కోసం వేల కిలోమీటర్ల ప్రయాణం

- 7,500 మంది సభ్యులతో విస్కీ క్లబ్ ఏర్పాటు
- బెంగళూరు కేంద్రంగా దేశవ్యాప్త నెట్‌వర్క్
- అరుదైన రుచులు.. ఆసక్తికర చర్చలు
- అనేక మంది ప్రముఖులతో గోవాలో విస్కీ పండుగ

ఒక గ్లాసు విస్కీ కోసం వేల కిలోమీటర్లు ప్రయాణిస్తారా? అందులోని ఒక్కో చుక్క రుచిని ఆస్వాదించడానికి గంటల తరబడి చర్చిస్తారా? ఆ గ్లాసులో కనిపించే రంగు నుంచి వచ్చే సువాసన వరకు ప్రతిదానికీ ఓ అర్థం వెతుకుతారా? అవును.. అలాంటి ఆసక్తే వేల మందిని ఒకే వేదికపైకి తీసుకొచ్చింది. ఇక్కడ విస్కీ అంటే కేవలం డ్రింక్ కాదు.. అదొక ప్రపంచం! దాని తయారీ వెనుక సాంకేతికత, ఏళ్ల తరబడి సాగే నిల్వ ప్రక్రియ, ప్రాంతాలను బట్టి మారే రుచులు.. ఇలా ప్రతి అంశానికీ ప్రత్యేకమైన కథ ఉంటుంది. ఆ కథలను అన్వేషిస్తూ, అనుభవాలను పంచుకుంటూ సాగుతున్న ఈ అరుదైన క్లబ్ గురించి తెలుసుకుందాం.

- సహనం వందే, హైదరాబాద్



సింగిల్ మాల్ట్ అమెచ్యూర్ క్లబ్.. సంక్షిప్తంగా స్మాక్. ప్రస్తుతం ఈ సంఘంలో సుమారు 7,500 మంది సభ్యులున్నారు. విస్కీపై ఆసక్తి ఉన్నవారిని ఒకచోట చేర్చడమే ఈ వేదిక ప్రత్యేకత. ఇందులో విస్కీ తయారీ, రకాలపై లోతైన అవగాహన ఉన్నవారితో పాటు కొత్తగా ఈ ప్రపంచాన్ని తెలుసుకుంటున్నవారూ ఉన్నారు. బెంగళూరు కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఈ సంఘం నెట్‌వర్క్ దేశంలోని పలు నగరాలకు విస్తరించింది.

అస్సాం నుంచి అరుదైన విస్కీల అన్వేషణ!

ఈ క్లబ్ సభ్యుల్లో ఒక్కొక్కరిదీ ఒక్కో నేపథ్యం. అస్సాంలోని దిబ్రూగఢ్‌కు చెందిన అనుపమ్ దత్తా వృత్తిరీత్యా వైద్యుడు. 2016 నుంచి ఆయన ఈ సంఘంలో సభ్యుడిగా కొనసాగుతున్నారు. విస్కీలోని ప్రత్యేకమైన రుచులు, వాసనలు, తయారీ విధానాలపై ఆసక్తితో వివిధ ప్రాంతాలకు ప్రయాణిస్తుంటారు. తనలాంటి అభిరుచి ఉన్నవారితో అనుభవాలను పంచుకుంటారు. క్లబ్ సమావేశాల్లో సభ్యులు విస్కీ రంగు, సువాసన, రుచులను నిశితంగా పరిశీలిస్తూ తమ అభిప్రాయాలను పంచుకుంటారు. ఒకే విస్కీని ఆస్వాదించిన ఇద్దరు వ్యక్తులు భిన్నమైన రుచులను గుర్తించడం కూడా ఇక్కడ ఆసక్తికర చర్చలకు కారణమవుతుంది.

గోవా వేదికగా అరుదైన విస్కీల పండుగ!

ప్రపంచంలోని అరుదైన సింగిల్ మాల్ట్‌లను తెలుసుకోవడం, వాటి తయారీ పద్ధతులు, నిల్వ ప్రక్రియల గురించి అవగాహన పెంచుకోవడం ఈ సభ్యుల ఆసక్తి. ప్రముఖ విస్కీ బ్రాండ్లతో కలిసి క్లబ్ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా గత సెప్టెంబర్‌లో గోవాలో ఇండియా రేర్ స్పిరిట్స్ విస్కీ టేస్టింగ్ సమావేశం జరిగింది. సింగిల్ మాల్ట్ అమెచ్యూర్ క్లబ్, డియాజియో సంస్థ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సభ్యులు హాజరయ్యారు. అరుదైన విస్కీల ప్రత్యేకతలను తెలుసుకుని తమ అనుభవాలను పంచుకున్నారు.

ఒక్కో చుక్క వెనుక ఏళ్ల నిరీక్షణ!

సింగిల్ మాల్ట్ తయారీలో మాల్టెడ్ బార్లీ ప్రధాన ముడిసరుకు. ప్రత్యేక పద్ధతుల్లో తయారు చేసిన అనంతరం నిర్దిష్ట పద్ధతిలో నిల్వ చేస్తారు. కొన్ని రకాలు ఎన్నో సంవత్సరాల పాటు పాతబడతాయి. ఈ క్రమంలో వాటి రంగు, వాసన, రుచి మారుతూ ఉంటాయి. బంగారు వర్ణం నుంచి ముదురు గోధుమ రంగుల వరకు భిన్నమైన ఛాయలు కనిపిస్తాయి. ఈ సూక్ష్మమైన ప్రత్యేకతలను గుర్తించడం, వాటి వెనుక ఉన్న కథలను తెలుసుకోవడమే ఈ సభ్యుల ఆసక్తి. వైద్యుల నుంచి వివిధ వృత్తులకు చెందిన వ్యక్తుల వరకు ఏడున్నర వేల మందిని కలిపిన ఈ క్లబ్.. ఒక అభిరుచి ఎంత పెద్ద అనుబంధంగా మారగలదో చాటుతోంది. ఒక్కో గ్లాసులో ఓ రుచి.. ఒక్కో రుచి వెనుక ఓ కథ.. ఆ కథలను పంచుకోవడానికి ఒక పెద్ద ప్రపంచమే ఈ సింగిల్ మాల్ట్ అమెచ్యూర్ క్లబ్!